క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

శ్రీరంగరాజపురం : మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పాల్గొంటారని జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు వారు నెలవాయి, అంబమహారాజపురం, పుల్లూరు, శెట్టివానత్తం, వి.వి.పురం, తయ్యూరు సచివాలయ పరిధిలోని గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్, మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఏఐటీయూసీ నేతల ఫిర్యాదు



ఎస్ఐ దస్తగిరికి ఫిర్యాదు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కార్వేటినగరం: మండల పరిధిలోని అమ్మపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏఐటీయూసీ కార్మిక జెండాను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కమ్యూనిస్టు పార్టీ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు అన్నారు. ఆదివారం కార్వేటినగరం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ దస్తగిరికి కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కార్వేటినగరం మండలంలో ఏఐటీయూసీ జెండాను 5 ఏళ్ల క్రితమే ఏర్పాటు చేశామని, ఏటా మే 1న మేడే ఉత్సవాన్ని కార్మిక సంఘాల నాయకులతో కలిసి జరుపుకుంటామని తెలిపారు. అయితే ఏఐటీయూసీ జెండాను శుక్రవారం రాత్రి తొలగించారని ఆరోపించారు. ఇలాంటి దుశ్చర్యకు పాల్పడి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి వివరించారు. కార్యక్రమంలో సీపీఐ చిత్తూరు జిల్లా సమితి సభ్యులు రఘు, గజేంద్ర బాబు, మండల కార్యదర్శులు గోవింద స్వామి, జయకుమారి, నాయకులు మోహన్, నిర్మల, మురగలక్ష్మి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

వెదురుకుప్పం: మండలంలోని జక్కిదొన ప్రాంతంలో ఆదివారం పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రమేష్ బాబు కథనం మేరకు..జక్కిదొన సమీపంలో పేకాట ఆడుతున్నట్లు రహస్య సమాచారం అందడంతో ఎస్ఐ రమేష్‌బాబు తన సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.19500 నగదును స్వా. దీనం చేసుకున్నారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ముగ్గురిని అరెస్టు చేశామని, మరో ముగ్గురు పరారైనట్లు తెలిపారు. ఈ ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. అలాగే పట్టుబడిన వారు శ్రీరంగరాజపురం మండలానికి చెందిన ఇద్దరు, పెనుమూరు మండలానికి చెందిన ఒకరిగా గుర్తించినట్లు చెప్పారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే తమకు వెంటనే సమచారం అందించాలని కోరారు. ప్రభుత్వ నిషేధిత కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

రాత్రివేళ నిఘా పెంచండి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రవికుమార్

శ్రీరంగరాజపురం: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని శ్రీరంగరాజపురం మండలం తమిళనాడుకు సరిహద్దులో ఉన్నందున రాత్రివేళలో నిఘా పెంచాలని డీఎస్పీ రవికుమార్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వివిధ కేసులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతంలో అక్రమ రవాణా ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, సిబ్బందితో నిఘా పెంచాలని సూచించారు. అలాగే నెలవాయి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకు తోలే ట్రాక్టర్లు, లారీలకు తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు ఉండేలా చూడాలన్నారు. రాత్రివేళల్లో గస్తీ నిర్వహించి నేరాల నియంత్రణకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఐ సత్యబాబు, ఎస్ఐలు షెక్షావలి, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అద్వితీయం బహురూప కళా విన్యాసం



తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి మృదంగ విద్వాంసుడు పీఎస్‌వీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రదర్శించిన వినూత్న బహురూప కళా విన్యాసం అద్వితీయంగా సాగింది. నారాయణతే నమో నమో అన్నమయ్య సంకీర్తనను ఒకే వేదికపై విభిన్న రాగాలలో 13 కళారూపాల ద్వారా 65 మంది కళాకారులతో గాత్ర, హిందూస్థానీ, లలిత, కర్ణాటక సంగీతం, పాశ్చాత్య సంగీతం, వాయిద్య సమ్మేళనం, హరికథ, నాట్యం, బుర్రకథ, నాటకం, చిత్రలేఖనం వంటి సకల కళా సమాహారంగా ప్రదర్శించి ఆహో అనిపించారు.

లోకనాయకి.. మహిషాసుర మర్దిని






నగరి: మహాగౌరి అలంకరణలో అన్నపూర్ణ, మహాలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి, కార్వేటినగరం: దుర్గాదేవిగా బంగారమ్మ, ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

- అమ్మవారి ఆలయాలకు పోటెత్తుతున్న భక్తులు
- వివిధ రూపాల్లో భక్తులను కటాక్షిస్తున్న అమ్మవారు
- ఆలయాల వద్ద అన్నదానం



పుత్తూరు: ద్రౌపదీదేవి ఆలయంలో పండరీ భజన చేస్తున్న చైర్మన్ హరి

నగరి : దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నగరి పట్టణంలోని దేవీ ఆలయాల్లో అమ్మవార్లకు పలు రూపాల్లో అలంకరించారు. దర్శించుకోవడానికి భక్తులు ఆలయాలకు క్యూకట్టారు. మండలంలోని బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి శ్రీమహాగౌరి అలంకరణ చేయగా భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. పట్టణ పరిధిలో కామాక్షిసమేత కరకంతేశ్వర ఆలయంలోని దుర్గాదేవి కామాక్షిదేవికి అర్చకులు దుర్గాప్రకాష్ ప్రత్యేక పూజలు నిర్వహించి కాత్యాయణి అలంకరణ చేపట్టారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు చేశారు. ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉత్సవమూర్తికి లక్ష్మి అలంకారం చేయగా మూలవర్లకు కుంకుమ అలంకరణ చేపట్టారు. నత్తంకండ్రిగ కరుమారియమ్మ ఆలయంలో అమ్మవారికి మహాదుర్గ అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు.

దుర్గాదేవి అలంకారంలో బంగారమ్మ

కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు ఆదివారం శ్రీబంగారమ్మ దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామునే అనంతరం ఉభయదారులైన మురహరినాయుడు కుటుంబ సభ్యులు అమ్మవారికి సమర్పించిన పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. అదేవిధంగా మధ్యాహ్నం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై తదితరులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో అన్నదానం

ముత్యాలమ్మ ఆలయంలో ..

ఆలత్తూరు గ్రామస్తులు కొంగుబంగారంగా పూజించే గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. అలాగే మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెంలో వెలసిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం కనకదుర్గమ్మ అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అలరించిన పండరి భజన

పుత్తూరు రూరల్: దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ద్రౌపదీదేవి ఆలయ ఆవరణలో నిర్వహించిన పండరి భజన అలరించింది. ద్రౌపదీదేవి కామాక్షీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ దేవత ఆరేటమ్మ రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. పట్టణ పురవీధుల్లో అమ్మవార్లను ఊరేగించారు. మున్సిపల్ చైర్మన్ హరి, గీతా మందిరం సభ్యులు ఆలయ చైర్మన్ లారీ మోహన్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వడమాలపేటలో

వడమాలపేటలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. సాయంత్రం లలితా సహస్ర నామార్చనలతో కుంకుమ పూజలు చేపట్టారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: అరుణగిరి క్షేత్రంలో రాజరాజేశ్వరిదేవి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు అభయమిచ్చారు. అలాగే అమ్మవారిని వెండి ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో పాటు సుగంధ పుష్పాలతో అలంకరించారు.

గంగాధర నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: అల్లియల్లమ్మ తల్లి ఎనిమిదో రోజు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారిని ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు.






వడమాలపేట: మహిషాసుర మర్దినిగా వాసవీదేవి, వెదురుకుప్పం: దుర్గాదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు,

ఘనంగా ఆర్కే సెల్వమణి జన్మదిన వేడుకలు



సెల్వమణికి కేక్ తినిపిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : మంత్రి ఆర్కే రోజా భర్త రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కేవీకే మైదానంలో క్రీడాకారులు, పార్టీ నాయకుల మధ్య ఆయన పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. నియోజకవర్గ పార్టీ శ్రేణులు దుశ్శాలువలు, పూలమాలలతో ఆయనను సన్మానించారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి మంత్రి ఆర్కేరోజాతో పాటు పార్టీ శ్రేణులకు పంచారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారుల ప్రతినిధులు 'హ్యాపీ బర్త్‌డే టూయూ సార్' అన్న ప్లకార్డులు చూపుతూ ఆయనకు శుభాకాంక్షలు తెలపడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఇది రాష్ట్రవ్యాప్తంగా తనకు శుభాకాంక్షలు తెలపిన సంతోషాన్ని ఇస్తోందని ఆర్కేసెల్వమణి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్లు వెంకటరత్నం, శంకర్, ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, నాయకులు చంద్రారెడ్డి, బీఆర్వీ అయ్యప్పన్, బీడీ భాస్కర్, దయానిధి, ఇంద్రయ్య, మురుగ, ఆనంద్‌కుమార్, ధనపాల్‌రెడ్డి, భూపాలన్, వైస్‌ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



హ్యాపీ బర్త్‌డే సార్ అంటూ ప్లకార్డులు చూపుతున్న క్రీడాకారులు

శ్రీరాములునాయుడు సేవలు ఎనలేనివి



శ్రీరాములునాయుడు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



శ్రీరాములునాయుడు వర్ధంతిని పురస్కరించుకుని అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతం కోసం శ్రీరాములు నాయుడు అహర్నిశలు కృషి చేశారని మాజీ మండల కన్వీనర్, స్థానిక సర్పంచ్ ధనుంజయవర్మ అన్నారు. ఆదివారం శ్రీరాములునాయుడు వర్ధంతిని పురస్కరించుకుని కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ ధనంజయవర్మ మాట్లాడుతూ 60 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన వ్యక్తి శ్రీరాములు నాయుడని, ఆయన కార్వేటినగరం మండలం అభివృద్ధి కోసం ఎనలేని సేవలు అందించారన్నారు. మండల మొదటి కన్వీనర్‌గా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామితో కలసి పార్టీని బలోపేతం చేసి పార్టీ విజయానికి కృషి చేసిన వ్యక్తి లేరన్నారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. అదేవిధంగా రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేపట్టి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శివప్రకాష్ మొదలి, వార్డుమెంబర్ రత్నంరెడ్డి, నాగేంద్ర, సాయి, పలువురు యువత పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 52 మంది ఎంపిక



కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారితో వైద్యులు

పుత్తూరు రూరల్: వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం తిరుపతి వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరంలో 175 మందికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు 52 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. మరో 60 మందికి కళ్లద్దాలతో పాటు మందులు పంపిణీ చేశారన్నారు. ఆపరేషన్లకు ఎంపికైన వారిని అరవింద ఆస్పత్రి వారే వారి వాహనంలో తీసుకెళ్లి ఆపరేషన్ల అనంతరం స్వస్థలానికి చేరుస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు లహరి, ప్రియాంక, పీఆర్ఓ గౌరీశంకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ విద్యార్థులు సత్తా చాటాలి



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి ఆర్కేరోజా



కప్పులు, షీల్డులు

- రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీల ప్రారంభంలో మంత్రి ఆర్‌కే రోజా

నగరి : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో సత్తా చాటాలని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆదివారం పట్టణంలోని కేవీకే మైదానంలో 8వ రాష్ట్రస్థాయి జూనియర్ బాల్‌బాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏ రంగంలోనైనా గెలుపుకోసం పోరాడుతూనే ఉండాలన్నారు. తప్పులు సరిదిద్దుకుంటూ పట్టుదలతో పోరాడితే అందరూ చాంపియన్లే అని తెలిపారు. నేడు ఉన్నత స్థానంలో ఉన్నవారందరూ ఎప్పుడో ఒకసారి ఓటమిని చూసినవారేనని పేర్కొన్నారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలన్నారు. ఆడినా, ఓడినా రికార్డుల్లో ఉంటారని గెలిస్తే చరిత్రలో ఉంటారని తెలిపారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు ఏకాగ్రతను, సహకరించే గుణాన్ని, బాధ్యతను అలవరిస్తాయన్నారు. ఉద్యోగ అవకాశాలను కల్పించడంతో పాటు ధైర్యంగా పదిమందికి స్ఫూర్తిగా నిలిచే అవకాశం ఉంటుందని, అందుకే క్రీడలను తాను ఎప్పుడూ ప్రోత్సహిస్తానని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికై జాతీయ పోటీల్లో పేరుప్రతిష్టలు తేవాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, డీఈఓ శేఖర్, సీఈఓ సెట్విన్ మురళీకృష్ణారెడ్డి, తిరుపతి సిద్ధార్థ, రాయలసీమ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు ఆనందరెడ్డి, నగరి, పుత్తూరు, నింద్ర ఎంపీపీ భార్గవి, మునివేలు, దీప తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు



క్రీడాకారులతో మంత్రి ఆర్కేరోజా



విజేత జట్టుతో మంత్రి ఆర్కేరోజా